ఈటల రాజేందర్ వ్యాఖ్యలు సరికావు

ఆళ్ల రామకృష్ణ

రవీంద్రభారతి,ఫిబ్రవరి 20 : దేశవ్యాప్తంగా కులగణన అసాధ్యం అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అనడం సరికాదని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ అన్నా రు. గురువారం ఆయన బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ.. బీసీ బిడ్డగా పుట్టి, ఈట ల రాజేందర్ అన్నంత దారుణంగా రాష్ట్రంలో రెడ్లు, బ్రాహ్మణులు కూడా అనలేదని చెప్పా రు. శవ్యాప్తంగా కులగణన కాదని ఎలా చెబుతారని ఆళ్ల రామకృష్ణ ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రం ఆ రాష్ట్రానికి బీసీ లిస్టులు తయారు చేసుకోవచ్చునని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

22న లక్ష్య, కూచిపూడి రంగప్రవేశం

లక్ష్య

రవీంద్రభారతి, ఫిబ్రవరి 20 : తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల శిష్యురాలు లక్ష్య రాచప్రోలు కూడిపూడి రంగప్రవేశం త్రిష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 22 వ తేదీన సాయంత్రం 6.45 గంటలకు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులు ప్రొఫెసర్ ఇ.సంధ్యారాణి, ఆర్.రవికుమార్ తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన లక్ష్య ప్రస్తుతం ఇండోర్ ఐఐటీలో స్పేస్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేస్తున్నారు.నాట్యంపై మక్కువతో తన 10వ ఏట త్రిష్ణ కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో చేరి డా.అలేఖ్య పుంజాల శిష్యురాలుగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పూర్వ మంత్రి జె గీతారెడ్డి హాజరవుతారని చెప్పారు. కళాప్రియులు పెద్ద ఎత్తున హాజరై ఆశీస్సులు అందించాలని కోరారు.

స్కూటీలు ఇవ్వాలని పోస్ట్ కార్డుల ఉద్యమం

రెడ్డిమహిళా కళాశాలలో పోస్ట్ కార్డులతో విద్యార్థులు

కాచిగూడ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటినా స్కూటీల హామీని నిలబెట్టుకోలేదని డాక్టర్ సత్య ఆరోపించారు. గురువారం నారాయణగూడ రెడ్డి ఉమెన్స్ కళాశాలలో డాక్టర్ సత్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించిన పోస్ట్ కార్డుల ఉద్యమంలో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 18 సంవత్సరాలు నిండిన విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ ఎంపీ, ప్రియాంక గాంధీ సరూర్ నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ లో ప్రకటించారన్నారు. ఆ హామీ ఇప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. వందలాది మంది విద్యార్థులు కళాశాల ఆవరణలో పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. ఇప్పటికైనా ప్రియాంక గాంధీ విద్యార్థినులకు ఇచ్చిన ఫ్రీ స్కూటీల హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

కచ్చామోరీ పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, ఫిబ్రవరి 20 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడుతున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. రిసాలా అబ్దుల్లాలో చేపడుతున్న కచ్చా మోరీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా రిసాల అబ్దుల్లాలో సీవరేజీ, కచ్చామోరీ సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానికులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సీవరేజీ సమస్యలను పరిష్కరించగా ప్రస్తుతం కచ్చామోరి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గౌలిగూడ కొత్త బస్తీలో పవర్ బోర్ పని చేయడం లేదని ఫిర్యాదు అందడంతో పవర్ బోర్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. రాబోయే వేసవి కాలంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు నరేశ్ గౌడ్, కిషోర్ సింగ్ రాజ్ పురోహిత్, సునీల్ అగర్వాల్, కిరణకుమార్, హిటాచి కత్రి, దీపక్, భగవా బాయి, మహేశ్ అగర్వాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి

అంబర్ పేటలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక ఫిబ్రవరి 20: అంబర్ పేట డివిజన్‌లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం అంబర్ పేట డివిజన్ న్యూ ప్రేమ్ నగర్ పోచమ్మ గుడి వద్ద నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా మహాబోగ్ బండర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ విచ్చేసి పూజలు చేశారు. బంజారా సేవా సంఘం నాయకులు వీరన్న నాయక్, చక్రు నాయక్,డిప్ల నాయక్,బాబునాయక్, రమేశ్ నాయక్,నరేశ్ నాయక్, బాపా నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వాలి

మొక్కనాటుతున్న కాలేరు పద్మ

కాచిగూడ, ఫిబ్రవరి 20: పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని గోల్నాక మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ అన్నారు. హరితహారం లో భాగంగా గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గోల్నాకలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే బాబు, రాము, కాలేరు రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

కులగణన సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం

గుడిమల్కాపూర్‌లో పర్యటిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

కార్వాన్, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం అన్ని కులాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన కుల గణనలో పేర్లను, కుటుంబ వివరాలను నమోదు చేయని వారు తిరిగి ఈ నెల 16 నుంచి 28 వరకు చేపట్టిన కుల గణనలో వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలుపుతూ గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఉప్పర్ బస్తీ, కార్వాన్, ఆర్య సమాజ్, రాంసింగ్ పురా తదితర బస్తీలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిరంజన్ అధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణనలో తమ కుటుంబ వివరాలు నమోదు చేయాలనుకుంటే టోల్ ఫ్రీ నంబర్ 04021111111కు ఫోన్ చేస్తే ప్రభుత్వ ప్రతినిధి వారి ఇంటికి చేరుకొని వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. అంతే కాకుండా ఎంపీడీఓ, వార్డు కార్యాలయాల్లో, లేదా ప్రభుత్వ వెబ్‌సైట్ SEEPCSURVEY. CGG. GOV. IN వెబ్‌సైట్‌లో సర్వే ఫాం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపి స్థానిక ఎంపీడీఓ, వార్డు కార్యాలయాల్లోని ప్రజా పాలన కేంద్రంలో అందజేయాలని సూచించారు. కొందరు కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు వారికి నచ్చిన సమాచారాన్ని మాత్రమే ఇవ్వవచ్చని ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు కూరాకుల క్రిష్ణ, వినోద్, వేణు, హమీద్, కిషన్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన జాతికి జీవితం అంకితం చేసిన మహనీయుడు సేవాలాల్

సంత్ సేవాలాల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఇతర నాయకులు

రవీంద్రభారతి,ఫిబ్రవరి 20 : గిరిజన జాతిని చైతన్య పరిచేందుకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు.సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ డా.కల్యాణ్‌నాయ్, కన్వీనర్లు జె ప్రేమ్, రవినాయక్ నేనావత్ సభా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ తదితరులు సంత్ సేవాలాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

యాదయ్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

సిరిపురం యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 20 : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సభ గురువారం ఓయూ చౌరస్తాలోని ఎన్‌సీసీ గేటు వద్ద సిరిపురం యాదయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు ఎమ్మెల్సీ ఎల్.రమణ ముఖ్య అతిథిగా హాజరై యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం యాదయ్య విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిరిపురం యాదయ్య స్మారక సమితి చైర్మన్ డా.తాటికొండ వెంకటరాజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో మరో ఎమ్మెల్సీ కోదండరాం, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, కన్వీనర్ డా.పుట్ట పాండురంగయ్య, కో-కన్వీనర్లు సిరిపురం ఉపేందర్, పగిడిమర్రి హరి, ఎస్.నర్సింగ్ రావు, సభ్యులు ప్రశాంత్, జయసింహా, శ్రీకాంత్, గోవర్ధన్, బి.జగదీశ్, బి.నీరజ, డా.సమత, వనం రమేశ్, సి.వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతు పనులను చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్

అబిడ్స్, ఫిబ్రవరి 20 : మహారాణా ప్రతాప్ కమ్యూనిటీహాల్‌లో మరమ్మతు పనులు చేపట్టాలని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ అన్నారు. ఆగాపురాలోని మహారాణా ప్రతాప్ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రెహానా, ఏఈ మహాదేవిలతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం లాల్ సింగ్ మాట్లాడుతూ.. యువతకు ఉపయోగపడే జిమ్, బాక్సింగ్, వాలీబాల్, క్రికెట్ సామగ్రిని ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా కమ్యూనిటీ హాల్ మెయింటెనెన్స్‌తో పాటు ఇద్దరు పనివారిని సమకూర్చాలని కోరారు. నాయకులు కూనల్‌సింగ్, ప్రదీప్ సింగ్, అక్షయ్ సాహు, కిషన్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

మంచినీటి సమస్యలు లేకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ అన్నారు. గురువారం నాన ల్ నగర్ జలమండలి సెక్షన్ కార్యాలయంలో మేనేజర్ ఖలీముద్దీన్ తో కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాలార్జంగ్ కాలనీ. కాకతీయ నగర్ ప్రాంతాలలో నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 20

వార్షికోత్సవం

మెహి దీపట్నం డివిజన్ లోని అయోధ్య నగర్ కాలనీలో ఉన్న రాయల్ జూనియర్ కాలేజీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. మెహదీపట్నం రేతిబౌలి రింగ్‌రోడ్ లో ఉన్న రూప్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు మంచి జీవితాన్ని సాధించడానికి బాగా చదువుకోవాలని సూచించారు.

– మెహిదిపట్నం, ఫిబ్రవరి 20

చెత్తను తొలగించాలి

ప్రధాన రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్ గౌడ్ కోరారు. గంగానగర్లో చెత్త వ్యర్థాలు పేరుకుపోయాయన్న స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్ సూచనలతో.. గురువారం ఆయన సమస్యను జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించాలని ఆయన కోరారు.

– గోల్నాక ఫిబ్రవరి 20

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కారును తనిఖీ చేస్తున్న ఏసీపీ సంపత్ కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 20: వాహనదారులకు అణుగుణంగా చేపడుతున్న చర్యలకు ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ లోని పలు ప్రాంతాల్లో త్రీ, ఫోర్ విలర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, బ్లాక్ లేబుల్స్, అధిక సౌండ్ కలిగిన వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించి, కార్లలో అంటించిన బ్లాక్ స్టిక్కర్లు, సౌండ్ బాక్స్‌లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ వాహనాలకు పరిమితి మించి సౌండ్ ఉండరాదని పేర్కొన్నారు. నిబంధనలను పాటించని వాహనాలపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్, ఏ ఎస్ ఐ అనిల్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు

ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను తొలగించడం పట్ల ఎమ్మెల్యే రాజాసింగ్ ఆందోళన

అబిడ్స్, ఫిబ్రవరి 20 : ఫేస్ బుక్ ఇన్‌స్టాగ్రామ్ ల నుంచి తన ఖాతాలను ఆ సంస్థలు తొలగించడం పట్ల గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఎక్స్ లో చే సిన పోస్టులో హిందువులను లక్ష్యంగా చేసుకొని సెలెక్టివ్ సెన్సార్షిప్ దాడి చేస్తుందన్నా రు. నా కుటుంబం, స్నేహితులు, కార్యకర్తలు మద్దతుదారుల సోషల్ మీడియా ఖాతాలను ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. అంతకు ముందు రాహుల్ గాంధీ చేసిన ఫిర్యాదు ఆధారంగా అధికారిక ఖాతాలపై అన్యాయం జరిగిందని, ఇప్పుడు తన వీడియోలను షేర్ చేస్తున్న వారు సైతం అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారత దేశంలో దేవుళ్ల హిందూ సంస్కృతిని స్వామీజీలను నిరంతరం అపహాస్యం చేసే ఖాతాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీని అవమానించి భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడే వారికి ఎందుకు ఉచిత పాసును అనుమతిస్తున్నారని ఈ అణచివేత అమెరికాకు చెందిన ఇండియా హేట్ ల్యాబ్ ఇచ్చిన నివేదిక ఫలితమే అన్నారు. హిందూ విలువల కోసం నిలబడే వారిని అణచివేసేందుకు దీన్ని ఎజెండాగా స్పష్టమవుతుందని రాజాసింగ్ అన్నారు.

ఫుట్ పాత్ పై వ్యక్తి మృతి..

కాచిగూడ, ఫిబ్రవరి 20 : అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.అడ్మిన్ ఎస్ఐ డి. సుభాష్ తెలిపిన ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి(50)కాచిగూడ ఆర్టీసీ క్వాటర్స్ ఫుట్‌పాత్ పై గురువారం మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

4గురు బాలురు అదృశ్యం


తేజ్‌నాథ్‌రెడ్డి

నితీశ్‌చౌదరి

హర్షవర్ధన్

అజ్మత్

గోల్నాక, ఫిబ్రవరి 20 : స్కూలుకని వెళ్లిన నలుగురు బాలురు అదృశ్య మైన ఘటన అంబర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది . ఇన్‌స్పెక్టర్ డి. అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమ్ నగర్‌కు చెందిన తేజ్‌నాథ్ రెడ్డి (13), నితీశ్ చౌదరి (13), కే హర్షవర్ధన్(13) మహమ్మద్ అజ్మత్ (13) వీరంతా ప్రేమ్ నగర్ న్యూ చైతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు .. కాగా గురువారం ఉదయం స్కూలుకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి వెళ్లిన ఒకే స్కూలుకు చెందిన నలుగురు బాలురు కనిపించకుండా పోయారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంసీఏ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంసీఏ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 21వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు.

సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తామనడం హర్షణీయం

కమిషనర్ కార్యాలయం వద్ద రెండవ ఏఎన్ఎంలు నిర్వహిస్తున్న ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ

సుల్తాన్ బజార్ ఫిబ్రవరి 20 : రెండవ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠి డీఎంహెచ్ఎస్ ఆవరణలో గురువారం ధర్నా ను నిర్వహించారు. నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం ల యూనియన్ నాయకత్వంతో ధర్నా చేపట్టడంతో ప్రభుత్వం దిగి వచ్చి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలపడం ఏఎన్ఎంలు తాత్కాలికంగా సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్. వి.కర్ణన్ తో జరిగిన చర్చలలో ఏఎన్ఎం ల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ వలన తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ వెల్లడించారు. ఈ మేరకు కోఠి లోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల అనంతరం రెండవ ఏఎన్ఎం లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. చాలాకాలంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి మంచి అవకాశం లభించిందన్నారు. పరీక్ష రాయటానికి అర్హతలేని రెండవ ఏఎన్ఎంలకు రిటైర్మెంట్ బెనిఫిట్, వంద శాతం గ్రాస్ శాలరీ నీ అమలు చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించినట్లు తెలిపారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పీఆర్సీ బకాయిలను, సబ్ సెంటర్ అద్దె బకాయిలను మార్చి 31 తారీకు లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. నిర్దిష్టమైన ప్రకారం పని చెప్పకుండా ఎవరు విధులకు హాజరు కాకపోయినా ఆ విధులను సెకండ్ ఏఎన్ఎంలకే అప్పజెప్పడం కారణంగా వారు పని ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ బోయిని శ్యామల ఉపాధ్యక్షులు తన్వీర్ సుల్తానా, రత్నకుమారి, జయమ్మ , గిరిజా రెడ్డి, , సహాయ కార్యదర్శులు గీతా రాణి, పార్వతి, సంధ్యారాణి, గోపమ్మ , కృష్ణవేణి , శైలజ, కోశాధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం ఏర్పాటు

సుల్తాన్ బజార్ ఫిబ్రవరి 20 : టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కె. ఆర్. రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం ముజీబ్ హుస్సేని ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కె ఆర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ..విద్యాశాఖకు సంబంధించిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మొదటిసారి టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ సెంట్రల్ ఫోరం నూతనంగా ఏర్పాటు చేయడంతో పాటు తనను సెంట్రల్ ఫోరం అధ్యక్షుడిగా నియమించడం గర్వంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవికి నియమించినందుకు గాను టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీ లకు, ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి తోపాటు కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గుర్రపు డెక్క తొలగింపు

చెరువులలో గుర్రపు డెక్కను తొలగించే పనులను గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్-13 అధికారులు చేపట్టారు. ఈ పనులను శాతం చెరువులో కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు దోమల బెడద లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

– మెహిదీపట్నం

సంగమ్ మఠాధిపతి కి సన్మానం

కుంభమేళా విజయవంతంగా ముగించుకొని వచ్చిన లంగర్ హౌస్ సంగం రామ్ చంద్రజీ దేవాలయం తరపున అకాడను ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేసి లంగర్ హౌస్ గౌరవాన్ని నిలబెట్టిన శ్రీమంత రాహుల్ దాస్ బాబా ని లంగర్ హౌస్ బస్తీ వాసులు భారతీయ జనతా పార్టీ నాయకులు సన్మానం చేశారు. మాజీ కార్పొరేటర్ ఉదయ్ కుమార్, నాయకులు వినేష్‌సింగ్‌లింగారెడ్డి,ఇంద్రసేనారెడ్డి, భరత్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 20

సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజలకు రంజాన్ మాసంలో విద్యుత్ సమస్యలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ అన్నారు. గురువారం సాయంత్రం సీఈ కార్యాలయంలో సీఈ చక్రపాణి, ఎస్ ఈలు వెంకన్న,సో మి రెడ్డి, కరుణాకర్, డీ ఈ లు సుధీర్, ఫర్హత్‌అలీ ల తో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు కరెంటు సమస్యలు లేకుండా పనిచేయాలని అన్నారు. ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 20

శివం రోడ్డులో.. ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె

సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 20 : ఎల్ఐసీలో క్లాస్ 3, 4 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం వెంటనే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శివం రోడ్డులోని ఎల్ఐసీ బ్రాంచి ఉద్యోగులు ఒక గంట పాటు విధులు బహిస్కరించి సమ్మె నిర్వహించారు. ఈ రెండు డిమాండ్లతో ఈ నెల 11వ తేదీన దేశంలోని అన్నిశాఖలు, కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఉద్యోగులంతా ఒక గంట పాటు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు వేణుగోపాల్, బ్రహ్మనందగిరి మాట్లాడుతూ.. ఎల్ఐసీలో క్లాస్ 3, 4 ఉద్యోగాలకు గత కొన్ని దశాబ్దాలుగా రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని, మరోవైపు వేలాది ఉద్యోగులు సంస్థ నుంచి రిటైర్డ్ అవుతుండడంతో పాలసీదారులకు అందించవలసిన సేవల విషయంలో తీవ్ర ఒత్తిడి నెలకొంటున్నదన్నారు. రాబోయే రోజులలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి మరిన్ని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

తాళ్లగడ్డలో ముగిసిన కుస్తీ పోటీలు

తాళ్లగడ్డలోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ కేసరీ కుస్తీ పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిని సన్మానించిన బీజేపీ యువ నాయకుడు దేవర వంశీ తదితరులు.

– కార్వాన్